సాక్షి ఆదిలాబాద్

గురువారం । 7 । మార్చి । 2024



నేటి నుంచి 'వడ్డాడి' జాతర

మహాశివరాత్రి పురస్కరించుకొని వడ్డాడిలో గల భూలక్ష్మీ నరసింహస్వామి ఆలయ జాతర నేటి నుంచి మరూ కానుంది. 8లో▸

కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా జడ్జి డాక్టర్ వీఆర్ఆర్ వర ప్రసాద్ అన్నారు. జిల్లా కోర్టులో పోలీసు అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 16న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించేలా చూడాలన్నారు. జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి శివరాం ప్రసాద్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే, న్యాయమూర్తి మంజుల, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
36.0/21.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

నిరుద్యోగుల నిరసన



నినాదాలు చేస్తున్న నిరుద్యోగులు

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ పోస్టుల్లో తమకు అన్యాయం జరిగిందని పలువురు నిరుద్యోగ అభ్యర్థులు నిరసన చేపట్టారు. డీఈవో కార్యాలయ ఆవరణలో ప్లకార్డులతో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ.. జిల్లా విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఉర్దూ మీడియం అభ్యర్థులకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో 221 పోస్టులు అవసరం ఉండగా, కేవలం 52 మాత్రమే చూపించారని పేర్కొన్నారు. ఇందులో రిజర్వేషన్ కారణంగా ముస్లిం మైనార్టీలకు కేవలం ఏడు పోస్టులు మాత్రమే వస్తున్నాయని తెలిపారు. ఖాళీలకు అనుగుణంగా పోస్టులు చూపించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఈవో ప్రణీతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫేరోజ్ అహ్మద్, అబ్రార్ అహ్మద్, మహ్మద్ ఉమర్, మునీబ్, జావిద్, సిరాజొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

'అద్దె ఎగనామం'పై కమిషనర్ ఆరా

- నోటీసుల జారీకి రంగం సిద్ధం

సాక్షి ఎఫెక్ట్..

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్‌కు సంబంధించి వ్యాపార సముదాయ మడిగెల అద్దె బకాయిలు రూ. కోట్లలో ఉన్నా వ్యాపారులు చెల్లించడం లేదు. బల్దియా ఆదాయం కోల్పోతున్న తీరును వివరిస్తూ 'అద్దె ఎగనామం' శీర్షికన 'సాక్షి'లో బుధవారం ప్రచురితమైన కథనానికి మున్సిపల్ కమిషనర్ ఎండీ.ఖమర్ అహ్మద్ స్పందించారు. మడిగెల వ్యవహారాలు పర్యవేక్షించే విభాగం సిబ్బందిని పెండింగ్ బకాయిలు, దుకాణాల వారీగా రావాల్సిన అద్దె వివరాలు అడిగి తెలుసుకున్నారు. బకాయిదారులందరికీ నోటీసులను జారీ చేయాలని ఆదేశించారు. కమిషనర్ ఆదేశాలతో రంగంలోకి దిగిన సిబ్బంది దుకాణాల యాజమానులకు అందించేందుకు నోటీసులను సిద్ధం చేస్తున్నారు.

కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీవోస్ నాయకులు

కైలాస్‌నగర్: కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజర్షి షాను టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంద అశోక్, ఎడ్ల నవీన్ కుమార్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సంక్షేమ పాలనకు అందరూ సహకరించాలని కలెక్టర్ వారికి సూచించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘ బాధ్యులు తిరుమల్‌రెడ్డి, నూర్ సింగ్, సుజాత, రాధ, చంద్రశేఖర్, రాజేశ్వర్, గంగాధర్ తదితరులున్నారు.

మహిళా సాధికారతకు కేంద్రం పెద్దపీట

ఆదిలాబాద్: మహిళా సాధికారతకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో బుధవారం నిర్వహించిన శక్తి వంధన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోదీ నాయకత్వంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహిళల అభివృద్ధికి సంబంధించి అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. నారీ శక్తివంతం రాష్ట్ర సమన్వయకర్త సుహాసిని రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళలకు సంబంధించి అ నేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వాలు అడ్డుకుంటున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ధోని జ్యోతి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదినాథ్, జోగు రవి తదితరులున్నారు.

అర్హులకు సంక్షేమ ఫలాలే.. తొలి ప్రాధాన్యత



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

- ధరణి సమస్యల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్
- విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి
- పారదర్శకంగా పార్లమెంట్ ఎన్నికలు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో కొత్త కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలకు సంబంధించిన సంక్షేమ ఫలాలను అర్హులందరికీ అందించడమే తన తొలి ప్రాధాన్యత అని కొత్త కలెక్టర్ రాజర్షి షా అన్నారు. అలాగే ధరణి సమస్యలను స్పెషల్ డ్రైవ్‌తో పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. రానున్న పదో తరగతి పరీక్షలు, లోక్‌సభ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లుగా వెల్లడించారు. జిల్లా ప్రజలు తమ సమస్యలను ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణిలో తన దృష్టికి తీసుకురావచ్చని, వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటానన్నారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన ‹సాక్షి›కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

సాక్షి: జిల్లా కలెక్టర్‌గా మీ ప్రాధాన్యతలు..

కలెక్టర్: ప్రజాపాలన సంక్షేమ ఫలాలను అర్హులైన ప్రతీ ఒక్కరికి పూర్తిస్థాయిలో అందించడమే నా తొలి ప్రాధాన్యత. గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలకు సంబంధించి అర్హులై ఉండి లబ్ధి పొందని వారి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా సేవా కేంద్రాల ఏర్పాటుకు ఆదేశించింది. జిల్లాలోని మున్సిపల్, అన్ని ఎంపీడీవో కార్యాలయాల్లో వాటిని ఏర్పాటు చేస్తాం. ప్రజలకు టాంటాం ద్వారా అవగాహన కల్పిస్తాం. అర్హులైన వారు ఈ కేంద్రాలను సంప్రదించి వివరాలు నమోదు చేసుకునేలా చూస్తాం.

సాక్షి: పెండింగ్‌లో ఉన్న ధరణి సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపడుతారు..?

కలెక్టర్: ధరణి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తోంది. అన్ని మండలాల్లో రెవెన్యూ అధికారులు తమకు అందిన దరఖాస్తులను మాడ్యూల్స్ వారీగా పరిశీలిస్తున్నారు.ఆర్డీవోలు, తహసీల్దార్లతోత్వరలోనే ప్రత్యేక సమావేశం నిర్వహించి సమీక్షిస్తా. నిబంధనల ప్రకారం పరిష్కరించేలా చర్యలు తీసుకుంటా.

సాక్షి: జిల్లా అభివృద్ధికి ఎలాంటి ప్రణాళికతో ముందుకు సాగుతారు..?

కలెక్టర్: శాఖల వారీగా ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించడంతో పాటు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు పకడ్బందీగా అమలయ్యేలా క్షేత్రస్థాయిలో పర్యటిస్తా. జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో ముందుకు సాగుతూ ఆదిలాబాద్‌ను ఆదర్శ జిల్లాగా నిలిపేందుకు నా వంతు కృషి చేస్తా.

సాక్షి: పదో తరగతి పరీక్షలు, పార్లమెంట్ ఎన్నికలు ఒకే సమయంలో జరిగే అవకాశాలున్నాయి.. దీనిని ఏ విధంగా అధిగమిస్తారు?

కలెక్టర్: జిల్లాకు మహారాష్ట్రలోని చంద్రాపూర్, యావత్మాల్ జిల్లాలు సరిహద్దుగా ఉండటం కొంత సవాలుతో కూడుకున్నదే. అయితే ఆయా ప్రాంతాల నుంచి అక్రమంగా మద్యం, డబ్బు జిల్లాకు తరలించే అవకాశం ఉంటుంది. వాటికి ఏమాత్రం అవకాశమివ్వకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తాం. ప్రత్యేకంగా చెక్‌పోస్టుల ఏర్పాటుతో పాటు నిరంతర నిఘా ఉండేలా చర్యలు చేపడుతాం. పది పరీక్షల్లో గతంలో జరిగిన పొరపాట్లకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చూస్తాం. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని వసతులు కల్పిస్తాం. పరీక్షలు, పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి రాజీపడబోం.

సాక్షి: పార్లమెంట్ ఎన్నికలకు ఎలా సన్నద్ధమవుతున్నారు. కొత్త ఓటర్ల నమోదుపై ఎలాంటి దృష్టి సారించారు?

కలెక్టర్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా ఈ ఎన్నికలను సాఫీగా నిర్వహించే బాధ్యత నాపైనే ఉంటుంది. నియోజకవర్గ పరిధిలోని అధికారులతో సమన్వయం చేసుకుని ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తాం. పోలింగ్ కేంద్రాలతో పాటు రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాల్లోనూ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతాం. ఈ ఏడాది ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండే వారంతా ఓటర్లుగా తమ పేర్లను బీఎల్‌వోలు, ఓటరు హెల్ప్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుని ఓటు హక్కు పొందాలి.

సాక్షి: సాధారణ ప్రజలకు మీరిచ్చే సలహా, సూచనలు..

కలెక్టర్: జిల్లావాసులు తమ సమస్యలను ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో చెప్పుకోవచ్చు. పరిష్కారం అయ్యే అర్జీలను పెండింగ్‌లో ఉండకుండా చర్యలు చేపడుతాం. అలాగే మండల స్థాయిలో నిర్వహించే గ్రీవెన్స్‌లోనూ ప్రజలు తమ సమస్యలను విన్నవించవచ్చు.

సాక్షి: ఏజెన్సీ ప్రాంతంలో విద్య, వైద్యపరంగా అనేక సమస్యలున్నాయి. వాటిని ఏ విధంగా పరిష్కరిస్తారు?

కలెక్టర్: ఏజెన్సీ ప్రాంతంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తా. ఐటీడీఏ పీవోతో కలిసి సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి ప్రణాళిక సిద్ధం చేస్తాం. ఆదివాసీ గిరిజనులకు నాణ్యమైన విద్య, వైద్యసేవలందించేందుకు కృషిచే స్తాం. గిరిజన సంక్షేమవసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలలను సందర్శించి విద్యార్థులు రక్తహీనతకు గురికాకుండా నాణ్యమైన పోషకా హారం అందించేలా దృష్టిసారిస్తాం.మాతా, శిశు మరణాలు పూర్తిగా తగ్గేలా చర్యలు చేపడుతాం. సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన ఇంద్రవెల్లి అమరవీరుల స్మృతివనాన్ని సుందరంగా తీర్చిదిదేందుకు చర్యలు తీసుకుంటాం.

ఓవర్ టూ ఢిల్లీ!



బీఎల్ సంతోష్‌తో ఎంపీ సోయం బాపూరావు

- బీజేపీ రెండో జాబితాపై ఉత్కంఠ
- కొనసాగుతున్న 'సోయం' యత్నాలు
- ఎంపీ అభ్యర్థిపై ఎమ్మెల్యేల్లో ఏకాభిప్రాయం లేదన్న ప్రచారం
- కమలం పార్టీలో పార్లమెంట్ టికెట్‌పై జోరుగా చర్చ

సాక్షి,ఆదిలాబాద్: బీజేపీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిగా పార్టీ ఎవరిని ఖరారు చేస్తుందనే విషయంలో ఇప్పుడు దృష్టంతా ఢిల్లీ వైపు నెలకొంది. తొలి జాబితాలో ఎంపీ సోయం పేరు లేకపోవడంతో పదో తేదీలోపు విడుదల చేయనున్న రెండో జాబితాపై ఉత్కంఠ పెరిగింది. సిట్టింగ్‌కే టికెట్ ఇస్తారా.. మరెవరినైనా బరిలోకి దించుతారా అనేది ఇప్పుడు పార్టీలో సర్వత్రా చర్చనీయంశంగా మారింది. మరోవైపు ప్రధానమంత్రి మోదీ ఆదిలాబాద్ పర్యటన తర్వాత ఈ సెగ్మెంట్‌పై రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తి పెరిగింది.

ఢిల్లీలో సోయం..

మొదటి జాబితాలో పేరు లేకపోవడంతో ఎంపీ సోయం బాపూరావు అలర్ట్ అయ్యారు. రెండో జాబితాలో చోటు దక్కించుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఢిల్లీ వెళ్లిన ఆయన బుధవారం పార్టీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి బీఎల్ సంతోష్‌ను కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆయన సానుకూలంగా స్పందించారని ఎంపీ పేర్కొనడం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. అంతే కాకుండా మోదీ ఆదిలాబాద్ పర్యటనకు వచ్చినప్పుడు సభ వేదికపై ప్రధాని పక్క కుర్చీలో సోయం కూర్చున్నారు. ఆ సమయంలో కొద్దిసేపు మోదీతో ఆయన ముచ్చటించడం అందరి దృష్టిని ఆకర్షించింది. అయితే ఏం మాట్లాడారనేది సోయం వెల్లడించలేదు. మొత్తంగా తన ప్రయత్నాలను మాత్రం కొనసాగిస్తున్నారు.

ఎమ్మెల్యేల మధ్య ఏకాభిప్రాయం లేదనే చర్చ..

ఎంపీ సోయం బాపూరావు తిరిగి బీజేపీ టికెట్ కేటాయించే విషయంలో ఈ పార్లమెంట్ సెగ్మెంట్‌లోని ఎమ్మెల్యేలంతా వ్యతిరేకిస్తున్నారనే చర్చ మొదటి నుంచి సాగుతుంది. అయితే ఇప్పటికీ వారి మధ్యలో మరో అభ్యర్థి విషయంలో ఏకాభిప్రాయం లేదని అంటున్నారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్.. గొడం నగేశ్‌కు టిక్కెట్ ఇవ్వాలని పట్టుబడుతుండగా, ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ జాదవ్ రాజేష్‌బాబుకు ఇవ్వాలని అడుగుతున్నట్లు తెలుస్తోంది. బీజేఎల్‌పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఇప్పటివరకు అభ్యర్థి విషయంలో స్పష్టతనివ్వలేదని చర్చ సాగుతోంది. మరోవైపు సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అభిప్రాయం కూడా ఎలా ఉందనేదానిపై క్లారిటీ లేదు. దీంతో ఎమ్మెల్యేల మధ్య ఏకాభిప్రాయం లేదు అనే చర్చ పార్టీలో సాగుతోంది. ఢిల్లీ జాబితాలో సోయం బాపూరావు, రాథోడ్ రమేశ్, గొడం నగేష్, ఆదిలాబాద్‌కు చెందిన డాక్టర్ సుమలత పేర్లు ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తంగా రెండో జాబితాలో ఈ సెగ్మెంట్ బీజేపీ అభ్యర్థి ఖరారవుతుందా లేదా అనేది ఆసక్తికరంగా మారింది.

'గులాబీ' గూటికి పగుళ్లు!

- బీఎస్పీ, బీఆర్ఎస్ పొత్తుతో కాంగ్రెస్‌లోకి కోనప్ప
- ఇప్పటికే 'హస్తం' పార్టీలోకి పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత
- మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు పార్టీ మార్పుపై చర్చలు
- బీఆర్ఎస్ నేతలే లక్ష్యంగా కాంగ్రెస్, బీజేపీ పావులు



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: లోక్‌సభ ఎన్నికల ముందు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. బీఆర్ఎస్‌తో బీఎస్పీ పొత్తు ఖరారు కావడంతో సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు కోనేరు కోనప్ప, ఆయన సోదరుడు జెడ్పీ చైర్‌పర్సన్ కోనేరు కృష్ణారావుతోపాటు అనుచర వర్గం కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డిని బుధవారం కలి శారు. దీంతో పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఈ నియోజకవర్గంలో మరింత దెబ్బ తగలనుంది. తాజా పరిణామాలతో ఉమ్మడి జిల్లాలో మరి కొందరు నాయకులు కండువాలు మార్చుతారనే ప్రచారం జోరందుకుంది. ప్రధానంగా బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులే లక్ష్యంగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పావులు కదుపుతుండడంతో ఎవరు ఎటువైపు వెళ్తున్నారనేది ఆసక్తికరంగా మారింది. అటు ఆదిలాబాద్ ఇటు పెద్దపల్లి పార్లమెంటు స్థానాల్లో నాయకుల తీరు రాజకీయ మార్పులకు దారి తీస్తున్నాయి.

మాజీ ఎమ్మెల్యేల పక్క చూపులు

బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొందరు మాజీ ఎమ్మెల్యేలు పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాభవంతో నేతల్లో నైరాశ్యం నెలకొంది. తమ రాజకీయ భవిష్యత్ కోసం పార్టీ మారేందుకు అంతర్గతంగా చర్చలు సాగుతున్నాయి. కాంగ్రెస్‌లోకి వెళ్లడమా..? బీజేపీలో చేరడమా..? అనే దానిపై తర్జనభర్జనలు పడుతున్నారు. ప్రస్తుతం 'గులాబీ' పార్టీకి గడ్డు కాలమే ఉండడంతో కార్యకర్తలు, నాయకుల నుంచి ఒత్తిడి కారణంగా మార్పు తథ్యంగా భావిస్తున్నారు. ఇందుకు లోక్‌సభ ఎన్నికలు మంచి తరుణంగా భావిస్తూ ఎవరికి ఏ పార్టీతో మేలు ఉంటుందో లెక్కలు వేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ టచ్‌లోకి వెళ్లినట్లు సమాచారం. వచ్చే ఎన్నికల్లో తమకు ప్రాధాన్యత ఇస్తేనే చేరుతామనే మెలిక పెట్టినట్లుగా చెబుతున్నారు. అయితే ఎవరికీ స్పష్టమైన హామీ రానట్లు తెలిసింది. వీరితోపాటు మరో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు బీజేపీ నాయకులతో చర్చలు జరిపారు. తమ పార్టీలోకి రావాలని ఆహ్వానాలు అందడంతో పార్టీ మార్పుపై నిర్ణయం తీసుకోవడంపై ఆలోచిస్తున్నారు. ఓ మాజీ ఎమ్మెల్సీతోపాటు సీనియర్ నాయకులు సైతం పార్టీ మార్పుపై గత కొంతకాలంగా సమాలోచనలు చేస్తున్నారు.

బయటపడనున్న అసంతృప్తులు

ఉమ్మడి జిల్లాలో రెండు ఎంపీ స్థానాల గెలుపు కోసం కాంగ్రెస్, బీజేపీ గట్టి ప్రయత్నాలే చేస్తున్నాయి. ఇందుకు ధీటైన అభ్యర్థుల కోసం అనేక రకాలుగా వడపోతలు చేస్తున్నాయి. ఆదిలాబాద్ సిట్టింగ్ సీటును ఎంపీ సోయం బాపూరావుకే కట్టబెడతారా..? లేదా..? అనే సస్పెన్స్ కొనసాగుతోంది. మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్, డాక్టర్ సుమలత, జెడ్పీ చైర్‌పర్సన్ రాథోడ్ జనార్దన్, తదితరులు పోటీలో ఉన్నారు. ఆదివాసీ, లంబాడా వర్గాల ప్రభావం, ప్రత్యర్థి పార్టీల్లో అభ్యర్థుల ఖరారు కాకపోవడంతో వేచి చూస్తున్నారు. మళ్లీ 'సోయం'కు అవకాశం రాకపోతే ఆయన నిర్ణయం ఎలా ఉండబోతుందనే ఆసక్తి నెలకొంది. ఇక బీఆర్ఎస్ నుంచి మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ ఎంపీ గొడం నగేశ్ ఉన్నారు. నగేశ్ గత అసెంబ్లీ ఎన్నికల్లో బోథ్ టికెట్ ఆశించి భంగపడ్డారు. ఎమ్మెల్సీ, కార్పొరేషన్ పదవులు దక్కలేదు. దీంతో ఆయన నిర్ణయం ఎటువైపు ఉంటుందోనని ఆసక్తిగా మారింది. ఇక పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో బీఆర్ఎస్ అభ్యర్థిగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ప్రకటించగా, ఆయన ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్‌లో ఎంపీ టికెట్ ఆశించి పార్టీలో చేరిన సిట్టింగ్ ఎంపీ బొర్లకుంట వెంకటేశ్ నేత, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ తనయుడు గడ్డం వంశీక్రిష్ణ ప్రధానంగా పోటీలో ఉండగా, పెర్క శ్యామ్ మరికొందరు టికెట్ ఆశిస్తున్నారు. 'గడ్డం' కుటుంబానికే మళ్లీ టికెట్ ఇస్తే పార్టీకి ఇబ్బంది అవుతుందని కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో వంశీకి టికెట్ ఇస్తే నాయకుల్లో అసంతృప్తి రాజుకోనుంది. ఇక బీజేపీలో మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, దుర్గం అశోక్, కొయ్యల ఏమాజీ టికెట్ ఆశిస్తుండగా, ఎస్.కుమార్‌తోపాటు మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభ వంటి నేతలు పోటీలో ఉన్నారు.

తొలిరోజే బిజీబిజీగా..

- కలెక్టర్‌గా రాజర్షి షా బాధ్యతలు
- శుభాకాంక్షలు తెలిపిన అధికారులు
- ఆ వెంటనే సమీక్షలు.. పర్యటనలు

కైలాస్‌నగర్: కొత్త కలెక్టర్‌గా రాజర్షి షా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆ వెంటనే సమీక్షలు.. పర్యటనల్లో నిమగ్నమయ్యారు. తొలిరోజే బిజీ బిజీగా గడిపారు. ఉదయం 9.50 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయనకు ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మహతో, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి రమేశ్ రాథోడ్, కలెక్టరేట్ ఏవో అరవింద్ కుమార్, డీపీఆర్వో తిరుమల పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కార్యాలయ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఐటీడీఏ పీవో, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా, అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవితో పాటు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, ఉద్యోగులు పూల మొక్కలు, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సమీక్షలు.. క్షేత్రస్థాయి పర్యటనలు

అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. జైనథ్ మండల కేంద్రంలో పర్యటించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో తహసీల్దార్లు, మండల ప్రత్యేకాధికారులతో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు.

డాటా ఎంట్రీ పకడ్బందీగా చేపట్టాలి

ధరణి, ప్రజాపాలన దరఖాస్తుల డాటాఎంట్రీని పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ రాజర్షి షా అన్నా రు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ధరణి పెండింగ్‌కు సంబంధించి అర్హత ఉన్న ప్రతీ దరఖాస్తును ఆమోదించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాల ద్వారా అర్హులైన వారంతా ప్ర యోజనం పొందేలా అన్ని ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజాపాలన సేవా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈకేంద్రాల్లో సిబ్బంది ఉదయం 10.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజాపాలనలో దర ఖాస్తు చేసుకోలేక పోయిన అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. అలాగే సరైన వివరాలు నమోదు చేయని వారి నుంచి వివరాలు సేకరించాలన్నారు.

జిల్లాలో నాలుగు రైతు వేదికల్లో 'వీడియో కాన్ఫరెన్స్' సేవలు

జైనథ్: జిల్లాలోని జైనథ్, ఇచ్చోడ, బోథ్, ఇంద్రవెల్లి రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సిస్టం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ సిస్టంను ప్రారంభించారు. రాష్ట్రంలోని 110 రైతు వేదికల్లో రైతు నేస్తం కార్యక్రమాన్ని హైదరాబాద్ నుంచి వర్చువల్ విధానంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించగా.. కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే శంకర్ హాజరయ్యారు. ఇందులో డీసీసీబీ అధ్యక్షుడు భోజారెడ్డి, పీఏసీ ఎస్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, ఎంపీపీ గోవర్ధన్, జిల్లా వ్యవసాయఅధికారి పుల్లయ్య పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ధరణి స్పెషల్ డ్రైవ్, ప్రజాపాలన దరఖాస్తుల డాటా ఎంట్రీ తీరును పరిశీలించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మార్కెట్ యార్డులో సోయా కొనుగోళ్ల తీరును పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్యాంసుందర్, ఎంపీడీవో రవీంద్రనాథ్ తదితరులున్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజర్షి షా, పక్కన ఎమ్మెల్యే శంకర్ తదితరులు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్ తదితరులుపాల్గొన్నారు.


బోథ్: మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఎంపీపీ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డి, తదితరులున్నారు.

కుష్ఠు గుర్తింపు ఉద్యమం

- ఈనెల 11నుంచి 24 వరకు 'ఆశ'లతో ఇంటింటి సర్వే
- జిల్లాలో ప్రస్తుతం 61మంది వ్యాధిగ్రస్తులు
- నివారణకు వైద్యఆరోగ్యశాఖ చర్యలు

వ్యాధిగ్రస్తుల వివరాలు..

సంవత్సరం	గుర్తించిన వ్యాధిగ్రస్తులు
2017-18	122
2018-19	85
2019-20	84
2020-21	41
2021-22	58
2022-23	62
2024(ఇప్పటివరకు)	61



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: కుష్ఠు నివారణకు వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో గుర్తింపు ఉద్యమం చేపడుతున్నారు. ఈమేరకు అధికారులు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ నెల 11 నుంచి 24 వరకు ఆశ కార్యకర్తలతో జిల్లాలో ఇంటింటి సర్వే చేపట్టనున్నారు. కుటుంబ సభ్యులందరిని పరీక్షిస్తారు. అనుమానితులను గుర్తించి పీహెచ్‌సీకి తరలించి పరీక్షలు చేయిస్తారు. నిర్ధారణ అయితే వ్యాధి ముదరకుండా, ఒకరి నుంచి మరొకరికి సోకకుండా చర్యలు చేపడతారు. జాతీయ కుష్ఠు నిర్మూలనలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. పర్యవేక్షణ కోసం సూపర్‌వైజర్లను సైతం నియమించారు. వైద్యాధికారులు, సిబ్బందికి బుధవారం శిక్షణ నిర్వహించారు.

తగ్గుముఖం పట్టని వ్యాధి..

జిల్లాలో కుష్ఠు తగ్గుముఖం పట్టడం లేదు. చాపకింద నీరులా వ్యాపిస్తోంది. అంటు వ్యాధి కావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో 61మంది వ్యాధిగ్రస్తులున్నారు. అవగాహన లేకపోవడం, సరైన సమయంలో గుర్తించక పోవడంతో రోజురోజుకు బాధితుల సంఖ్య పెరుగుతోంది. దాదాపు రెండు నెలల్లోనే 61 మందిని గుర్తించగా, ఇంటింటి సర్వే ద్వారా మరికొంత మంది బయటపడే అవకాశం లేకపోలేదు.

జిల్లాలో..

జిల్లాలో 22పీహెచ్‌సీలు, ఐదు పట్టణఆరోగ్యకేంద్రాలున్నాయి. 8లక్షల 27వేల జనాభా, లక్ష 68వేల 238 నివాసాలు ఉన్నట్లు వైద్యశాఖ అంచనా వేసింది. కుష్ఠు గుర్తింపు ఉద్యమం కోసం జిల్లాలో 1006 మంది ఆశ కార్యకర్తలను నియమించారు. గ్రామీణ ప్రాంతాల్లో 917మంది, పట్టణ ప్రాంతాల్లో 89 మంది సర్వే చేపట్టనున్నారు. పర్యవేక్షించేందుకు 200 బృందాలను ఏర్పాటు చేశారు. ఈ నెల 11 నుంచి 24వరకు ఇంటింటి సర్వేకొనసాగనుంది. ప్రతిరోజు ఉదయం 6 నుంచి 9.30 గంటల వరకు ఆశ కార్యకర్తలు సర్వే నిర్వహించనున్నారు.

కుష్ఠు రహిత జిల్లా ధ్యేయం..

కుష్ఠు రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నాం. ఈనెల 11 నుంచి 24 వరకు ఇంటింటి సర్వే నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇందులో భాగంగా ఆశ కార్యకర్తలు ప్రతీ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి పరీక్షిస్తారు. అనుమానితులను సంబంధిత పీహెచ్‌సీలకు తీసుకెళ్లి పరీక్షలు చేయిస్తారు. నిర్లక్ష్యం వహిస్తే కుటుంబ స భ్యులందరికీ వ్యాధి సోకే ప్రమాదం ఉంటుంది. ఈమేరకు ప్రతి ఒక్కరూ సహకరించాలి.

– నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

క్లుప్తంగా

9, 10వ తేదీల్లో అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు

కుంటాల: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని సూర్యాపూర్ రాజరాజేశ్వర ఆలయ ప్రాంగణంలో ఈ నెల 9న, ఓల శివాలయ ఆలయ ప్రాంగణంలో 10న అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. మల్లయోధులు కుస్తీ పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడి మృతి


హన్మంతు(ఫైల్)

నర్సాపూర్ (జీ): మండలంలోని బామిని(బీ) గ్రామానికి చెందిన యువకుడు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బామిని(బీ) గ్రామానికి చెందిన చాతల హన్మంతు(30) చేపలు పట్టడానికి బుధవారం ఊరు పక్కనగల పాత చెరువుకు వెళ్లాడు. గాలంతో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు చెరువులో పడి నీట మునిగాడు. చెరువులో బట్టలుతికేందుకు వెళ్లిన మృతుడి బంధువు గమనించి గ్రామంలోకి వెళ్లి గ్రామస్తులకు సమాచారం అందించింది. గ్రామస్తులు, బంధువులు వెంటనే చెరువు వద్దకు చేరుకుని హన్మంతును బయటకు తీసి ఆటోలో 108లో నిర్మల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. అతడి భార్య గంగాసాగర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు.

మెడికల్ షాపుల తనిఖీ


తనిఖీ చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత

ఇచ్చోడ/సిరికొండ: ఇచ్చోడ, సిరికొండ మండల కేంద్రాల్లోని పలు మెడికల్ షాప్‌లను డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత బుధవారం తనిఖీ చేశారు. గడువు ముగిసిన మందులను విక్రయించవద్దని నిర్వాహకులకు సూచించారు. వైద్యులు రాసిన మెడిసిన్ మాత్రమే విక్రయించాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ద్విచక్రవాహనాల చోరీ నిందితుల అరెస్ట్


స్వాధీనం చేసుకున్న బైకులతో సీఐ అనిల్

నిర్మల్‌టౌన్: నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో ద్విచక్ర వాహనాలను దొంగిలించిన ఇద్దరు మైనర్లను అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ అనిల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ... నిర్మల్ పట్టణంలో మూడు, సారంగపూర్, నిజామాబాద్‌లో ఒక్కో ద్విచక్రవాహనాలను దొంగిలించిన మైనర్లు వీటిని విక్రయించేందుకు నిర్మల్‌కు వచ్చారు. బుధవారం నిర్మల్‌లో పట్టణ పోలీసులు వాహనాలు తనిఖీ చేసే క్రమంలో అనుమానాస్పదంగా కనిపించారు. వీరిని విచారించడంతో పలుచోట్ల బైక్‌లు దొంగిలించినట్లు ఒప్పుకొన్నారు. వీరి నుంచి ఐదు బైకులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఇడకు సీఐ తెలిపారు. ఎస్సై రాజేశ్వర్, కానిస్టేబుళ్లు సందీప్, సుదర్శన్ తదితరులున్నారు.

ముస్తాబైన ఆలయాలు

- రేపు మహాశివరాత్రి పర్వదినం
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- సూర్యాపూర్‌లో కుస్తీ పోటీలు


సూర్యాపూర్‌లో రాజరాజేశ్వరుడు

కుంటాల: మండలంలోని సూర్యాపూర్ అటవీ ప్రాంతం సరిహద్దులో శ్రీరాజరాజేశ్వరాలయం వెలిసింది. గతంలో ఇక్కడ మూడు పురాతన విగ్రహాలు ఉండగా గ్రామస్తులు వాటికి పూజలు నిర్వహించేవారు. ఓలా గ్రామానికి చెందిన తిప్ప గజ్జారాం శివరాత్రి సందర్భంగా ఉపవాస దీక్షలు చేపట్టి నిత్యం పూజించేవాడు. గ్రామస్తులు చందాలు పోగుచేసి ఆలయ నిర్మాణానికి ముందుకు రాగా, కుంటాలకు చెందిన దూదేకుల బాబు ఆలయ నిర్మాణంలో ప్రత్యేక పాత్ర పోషించడం విశేషం. మహారాష్ట్రకు చెందిన భక్తులు అధికసంఖ్యలో హాజరై శ్రీరాజరాజేశ్వరుడికి కోడెలు సమర్పిస్తారు. కుస్తీ పోటీలు నిర్వహిస్తారు. ముథోల్ ఎమ్మెల్యేగా పోటీ చేసే నేతలు నియోజకవర్గానికి సూర్యాపూర్ రాజరాజేశ్వరాలయం ఈశాన్య దిశలో ఉండడంతో ఆలయంలో పూజలు నిర్వహించి ఇక్కడి నుంచే ప్రచారం ప్రారంభిస్తారు.

ప్రత్యేకం.. ఓలాదీశ్వరుడి ఆలయం


ఓలాలోని శివలింగం

కుంటాల మండలంలోని ఓలా లింగ మూర్తి ఆలయం రాతి కట్టడంతో కాకతీయుల కాలంలో నిర్మించారు. ఈ ఆలయానికి సుమారు 150 ఏళ్ల చరిత్ర ఉంది. ప్రతీ సోమవారం భక్తులు అధికసంఖ్యలో ఆలయానికి వచ్చి పూజలు చేస్తారు. భక్తుల కోరిన కోర్కెలు నెరవేరుతుండడంతో ఓలా గ్రామంలో నిత్యం ఓలాదీశ్వరుడుగా పూజలందుకుంటున్నాడు. గత ప్రభుత్వం రూ.25 లక్షలతో ఇక్కడ శివాలయాన్ని నిర్మించింది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇక్కడ కుస్తీ పోటీలు నిర్వహిస్తారు.

57 ఏళ్లుగా కుస్తీ పోటీలు


ఓలాదీశ్వరుడి ఆలయం

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కుంటాల మండలంలోని సూర్యాపూర్ రాజరాజేశ్వర ఆలయ ఆవరణలో గ్రామస్తులు 57 ఏళ్లుగా కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నారు. ఆలయ నిర్మాణానికి కృషి చేసిన పోరా గ్రామానికి చెందిన తిప్ప గజ్జారాం ఆలోచనతో అప్పటి గుర్రం చౌకీదార్ (అటవీశాఖ అధికారి) ప్రోత్సాహంతో ప్రత్యేకంగా నిర్వహిస్తున్న కుస్తీ పోటీల్లో తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి మల్లయోధులు అధికసంఖ్యలో వచ్చి తలపడతారు. ఓలా గ్రామంలోనూ ఆరేళ్లుగా కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నారు.

పశుపతినాథ్ ఆలయంలో..


ముస్తాబైన పశుపతినాథ్ ఆలయం

ముథోల్: మండల కేంద్రంలోని పశుపతినాథ్ ఆలయం శివరాత్రికి ముస్తాబైంది. ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. శివరాత్రికి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


శ్రీ చక్ర లింగేశ్వర స్వామి ఆలయం

టెంబుర్నిలో శ్రీ చక్ర లింగేశ్వరస్వామి

నర్సాపూర్(జి): మండలంలోని టెంబుర్ని గ్రామ శివారులో శ్రీ చక్ర లింగేశ్వర స్వామి ఆలయానికి ప్రత్యేకత ఉంది. గ్రామస్తులు ఉపాధి పనులు చేస్తుండగా శివలింగం బయటపడింది. సుమారు 500 ఏళ్ల నాటిదని చరిత్రకారులు చెబుతున్నారు. ఇటీవల దేవాలయ శాఖ నిధులతో కల్యాణ మండపం నిర్మించారు. ఆలయ ప్రాంగణంలో గోశాల ఏర్పాటు చేశారు. శివరాత్రి ఉత్సవాలు, తొమ్మిదో వార్షికోత్సవం సందర్భంగా గురు, శుక్ర, శనివారాల్లో ఘనంగా పూజలు నిర్వహించనున్నారు. మండలంలోని చాక్ పల్లి అనుబంధ గ్రామం పాత డొంగుర్గాం శివారు సుద్ద వాగు ఒడ్డున సిద్దేశ్వరాలయం వెలిసింది. ఐదు శతాబ్దాల క్రితం నవసిద్ధులు, మునీశ్వరులు ఇక్కడ తపస్సు చేసినట్లు పూర్వీకులు చెబుతుంటారు. శివరాత్రి రోజు ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు.

స్వామి దర్శనం.. సర్వపాపహరణం

- ముస్తాబైన 'కదిలె' శ్రీమాతాన్నపూర్ణ సహిత పాపహరేశ్వరాలయం
- నేటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు


స్వామివారి విగ్రహం

దిలావర్‌పూర్: సహ్యాద్రిపర్వత శ్రేణుల్లోని 'కదిలి' లోయలో కొలువుదీరి ఉన్న శ్రీమాతాన్నపూర్ణ సహిత పాపహరేశ్వరాలయాన్ని దర్శించుకుంటే సర్వపాపాలు హరించబడతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. దిలావర్‌పూర్ మండలం మాడేగాం గ్రామపంచాయతీ పరిధిలోని కదిలి గ్రామ పరిసర అటవీప్రాంతంలో వెలసిందే శ్రీమతాన్నపూర్ణ పాపహరేశ్వరాలయం. సహ్యాద్రి కొండల్లో మాతృహత్యాపాపం నుంచి విముక్తి పొందేందుకు పరశురాముడు ఇక్కడ స్వయంగా శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజించాడని ఆలయ చరిత్ర చెబుతోంది. ప్రకృతి అందాల నడుమ వెలసిన పాపహరేశ్వరస్వామి చెంతనే శ్రీమాతాన్నపూర్ణేశ్వరీదేవి వెలసింది. కోరిన కోర్కెలు తీరుస్తూ నిత్యం భక్తుల పూజలందుకుంటోంది.

కదిలే శివలింగం..

గర్భగుడిలోని శివలింగం భక్తితో పరిశీలిస్తే కదులుతున్నట్లు కనిపిస్తుంది. స్వామివారి ముందున్న నందీశ్వరుడి చెవిలో తమ కోరికలు చెప్పుకొంటే నెరవేరుతాయని భక్తుల నమ్మకం. ప్రాంగణంలో ఒకే కాండంలో 18 వృక్షాలు మిలితమైన వట వృక్షం, అత్తకోడళ్ల గుండాలు, సీతమ్మ అల్లుబండ, అన్నపూర్ణమాత, ఆలయ ద్వారపాలకులు సప్తరుషుల ధ్యాన మందిరం, నందీశ్వరుడు, ఆవునోటి ద్వారా కోనేరులో చేరే నీరు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. చోళులు, కాకతీయ రాజుల కాలంలో నిర్మించిన అనేక విగ్రహాలు వారి కళానైపుణ్యానికి ప్రతిరూపంగా నిలుస్తున్నాయి.


శ్రీమాతాన్నపూర్ణ పాపహరేశ్వరాలయం


ఆలయంలోని నందీశ్వరుడు

వివిధ రాష్ట్రాల నుంచి..

పాపహరేశ్వరాలయానికి తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారి సేవలో పునీతులవుతున్నారు. అనేకమంది సినీ, రాజకీయ ప్రముఖులు కూడా స్వామివారికి ప్రత్యేక రుద్రాభిషేక పూజలు తరచూ నిర్వహిస్తుంటారు. ఈ ఆలయానికి నిర్మల్ పట్టణం నుంచి భైంసా పట్టణానికి వెళ్లే రహదారి గుండా 12 కిలోమీటర్లు ప్రయాణిస్తే దిలావర్‌పూర్ గ్రామ బస్టాండ్‌కు చేరుకోవచ్చు. ఇక్కడి నుంచి ఉత్తరదిశలో ఉన్న ఆలయ స్వాగత తోరణం నుంచి మరో ఆరు కిలోమీటర్లు ప్రయాణిస్తే పాపహరేశ్వరాలయానికి చేరుకోవచ్చు.

ఏర్పాట్లు పూర్తి..

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో గురువారం రాత్రి ప్రారంభమై శుక్ర, శనివారాలు జరిగే పూజాకార్యక్రమాల కోసం ఆలయ కమిటీ, దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ నార్వాడి వెంకట్రావు పాటిల్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ రవికిషన్‌గౌడ్ తెలిపారు. నిర్మల్ పట్టణం నుంచి భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఆలయ ప్రాంగణంలో శుక్రవారం మహాశివరాత్రి పర్వదినాన తెల్లవారుజాము బ్రహ్మముహూర్తాన స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, మంత్రపుష్పం నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించనున్నారు. అనంతరం రాత్రి 11గంటల నుంచి మహాన్యాస పూర్వక అభిషేకం, బిల్వార్చన నిర్వహించి స్వామివార్ల లింగోద్భవ కాలదర్శన కార్యక్రమానంతరం శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు ఆలయ ముందుభాగంలో ఏర్పాట్లు చేశారు. శనివారం ఆలయ ప్రాంగణంలో భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.


శ్రీమాత అన్నపూర్ణేశ్వరీదేవి

కాల్వ, దిలావర్‌పూర్‌లో..

మండలంలోని కాల్వ పరిసర అటవీప్రాంతంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని కూడా మహాశివరాత్రి పర్వదినాన భక్తులు దర్శించుకోనున్నారు. నిర్మల్ నుంచి బయలుదేరిన భక్తులు కదలి పాపహరేశ్వరాలయానికి వెళ్లే రోడ్డు మార్గంలో ఎనిమిది కిలో మీటర్లు ప్రయాణిస్తే న్యూలోలం గ్రామ సమీపాన నిర్మల్–భైంసా రహదారిపై స్వామివారి స్వాగతోరణం దర్శనమిస్తుంది. తోరణంగుండా మరో మూడుకిలోమీటర్లు ఉత్తరాన ప్రయాణిస్తే ఆలయానికి చేరుకోవచ్చు. భక్తుల పాలిట కరుణామయుడిగా నీరాజనాలు అందుకుంటున్నాడు. స్వామివారి చెంతనే ఉన్న అష్టముఖి కోనేరులో స్నానం చేసి స్వామివారిని దర్శించుకుంటే సంకటాల నుంచి ఊరట లభిస్తుందని భక్తుల నమ్మకం. స్వామివారు కొలువుదీరిన గుట్ట వక్ర సింహ ఆకారంలో ఉండడం విశేషం. మండల కేంద్రమైన దిలావర్‌పూర్‌లోని ఏకనాథుని ఆలయం, అటవీప్రాంతంలోని శ్రీరాజరాజేశ్వరాలయాల్లో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్ర, శనివారాల్లో ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించనున్నారు.

అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం



శ్రీమాతాన్నపూర్ణ పాపహరేశ్వరాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్ర, శనివారాల్లో జరిగే మహోత్సవాలకు సంబంధించి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. వివిధ రాష్ట్రాలు, పొరుగు జిల్లాల నుంచి వచ్చే భక్తులకు తాగునీరు, వైద్యసేవలు, అన్నదానం, వసతి తదితర ఏర్పాట్లు చేశాం. స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులు కూడా ఆలయ కమిటీ, అధికారుల సూచనలు పాటించి స్వామివారిని దర్శించుకోవాలి.

– రంగు రవికిషన్‌గౌడ్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈవో

విజయలక్ష్మికి జాతీయ పురస్కారం



అవార్డు అందుకుంటున్న విజయలక్ష్మి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణం ఇందిరానగర్ కాలనీకి చెందిన వీరాంజనేయ స్వయం సహాయక సంఘం (ఎస్‌హెచ్‌జీ) అధ్యక్షురాలు విజయలక్ష్మి బుధవారం జాతీయస్థాయి పురస్కారం అందుకున్నారు. బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకుని చిరు ధాన్యాలతో కూడిన ఆహార ఉత్పత్తులను తయారు చేస్తూ అంచెలంచెలుగా ఎదిగిన ఆమెను ఉత్తమ వ్యాపారవేత్తగా కేంద్రం గుర్తించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ దేశవ్యాప్తంగా పురస్కారాలు ప్రకటించగా తెలంగాణ నుంచి విజయలక్ష్మి ఎంపికయ్యారు. ఢిల్లీలోని గురుగాంవ్ పట్టణంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో అక్కడి మేయర్ మధు ఆజాద్ చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారం అందుకున్నారు. విజయలక్ష్మి జాతీయ స్థాయి అవార్డు అందుకోవడంపై మున్సిపల్ కమిషనర్ ఎండీ.ఖమర్ అహ్మద్ హర్షం వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ పేరును ఢిల్లీ వరకు తీసుకెళ్లినా విజయ హెల్త్‌ఫుడ్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు వ్యాపారవేత్తగా ఎదుగడం గర్వంగా ఉందని పేర్కొంటూ ఆమెకు అభినందనలు తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: బజార్‌హత్నూర్ మండలం మోర్ఖండికి చెందిన 70 ఏళ్ల టేకం కిషన్ అనే వృద్ధుడు అనారోగ్యంతో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో చేరాడు. ఈనెల 5న ఆస్పత్రి నుంచి అదృశ్యమయ్యాడు. కుటుంబీకులు చుట్టుపక్కల గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో ఆయన మనువడు దినేష్ టూటౌన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమణారెడ్డి వివరించారు.

ఇంద్రవెల్లిలో యువకుడు..

ఇంద్రవెల్లి: మండలకేంద్రంలో బామ్నె రుతిక్ (23) అనే యువకుడు అదృశ్యమయ్యాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. స్థానిక భీంనగర్ కాలనీకి చెందిన రుతిక్ ఈ నెల 3న ఇచ్చోడలోని తన స్నేహితుడి ఇంట్లో ఎంగేజ్మెంట్ కార్యక్రమానికి వెళ్తానని చెప్పి వెళ్లి తిరిగా రాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో, పలుచోట్ల వెదికినా ఆచూకీ లభించకపోవడంతో యువకుడి తండ్రి విక్రమ్ బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు.

నేటి నుంచి వడ్డాడి నరసింహస్వామి జాతర


ముస్తాబైన లక్ష్మీనరసింహ స్వామి ఆలయం

తాంసి: మండలంలోని వడ్డాడి గ్రామంలో వెలసిన భూలక్ష్మీ నరసింహస్వామి ఆలయ జాతరను ఏటా మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. కోరిన కోర్కెలు తీర్చే స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివస్తారు. నేటి నుంచి ఉత్సవాలు షురూ కానున్న నేపథ్యంలో నిర్వాహకులు ఇప్పటికే ఆలయాన్ని సర్వంగ సుందరంగా ముస్తాబు చేశారు. మూడు రోజులపాటు నిర్వహించే జాతరలో భాగంగా నేడు సామూహిక సత్యనారాయణ వ్రతాలు, హోమం, స్వామివారి కల్యాణం చేపట్టనున్నారు. చివరి రోజు శనివారం ఉదయం పూర్ణాహుతి, సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్ తెలిపారు. ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

- ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలోమన్


మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న ఆర్‌ఎం

ఆదిలాబాద్: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఆదిలాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలోమన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళా దినోత్సవంను బుధవారం ముందస్తుగా నిర్వహించారు. పలువురు ఆర్టీసీ ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లో ఎదుగుతున్నారన్నారు. ఆర్టీసీ అభివృద్ధిలో సైతం కీలకపాత్ర వహిస్తున్నారన్నారు. ఆదిలాబాద్ డిపోమేనేజర్ కల్పన తదితరులు ఉన్నారు.

శుభకార్యానికి వెళ్తూ.. కానరాని లోకాలకు


జాదవ్ వినోద్ (ఫైల్)

నేరడిగొండ: శుభకార్యానికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఒకరు కానరాని లోకాలకు వెళ్లగా, ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని బోరిగాం క్రాస్ రోడ్డు వద్ద బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బోథ్ మండలం నిగిని గ్రామానికి చెందిన జాదవ్ వినోద్(33), రాథోడ్ ఉద్దవ్, ప్రదీప్‌లు బైక్‌పై నేరడిగొండ మండలంలోని బోరిగాంలో వారి బంధువుల వివాహానికి ఎన్‌హెచ్ 44 గుండా వెళ్తున్నారు. బోరిగాం క్రాసింగ్ వద్ద అతివేగంగా, అజాగ్రత్తగా రాథోడ్ ఉద్దవ్ బైక్ నడపడంతో వాహనం అదుపుతప్పి ముగ్గురు కిందపడ్డారు. వినోద్‌కు తలకు తీవ్ర గాయాలై సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. మిగతా ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో వారిని చికిత్స నిమిత్తం నిర్మల్ ఆస్పత్రికి తరలించారు. మృతదేహానికి బోథ్ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

మహిళను వేధిస్తున్న యువకుడిపై కేసు

ఇంద్రవెల్లి: మహిళను వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సునీల్ తెలిపారు. మండలంలోని గిన్నెరతండా గ్రామానికి చెందిన చావన్ అంకూష్(23) అదే గ్రామానికి చెందిన ఓ మహిళను ఏడాదిగా ఫోన్ చేస్తూ వేధింపులకు గురి చేస్తున్నాడు. పలుమార్లు గ్రామ పెద్దలతో పంచాయితీ నిర్వహించినా యువకుడి ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ క్రమంలో బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధిత మహిళ పేర్కొంది. యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక లారీకి రూ.50వేల జరిమానా

కుంటాల: మండలంలోని అర్లి(కే)16 జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం ఎస్సై రజనీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. నిర్మల్ నుంచి కుంటాలకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకుని తహసీల్దార్‌కు అప్పగించారు. ఇసుక లారీకి తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్ రూ.50వేల జరిమానా విధించారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి


బహుమతి ఇస్తున్న మహేశ్వర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి

నిర్మల్‌ఖిల్లా: విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, డీఈవో రవీందర్‌రెడ్డి, అల్ఫోర్స్ చైర్మన్ వీ నరేందర్ రెడ్డి సూచించారు. జిల్లాకేంద్రంలోని దివ్య గార్డెన్స్‌లో బుధవారం సాయంత్రం అల్ఫోర్స్ హైస్కూల్ ఆధ్వర్యంలో 'సాంప్రదాయ్ మహోత్సవ్' ను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో ఆకాశమే హద్దుగా, కళావైభవం చాటే కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి శ్రద్ధ, ఏకాగ్రతతో అధ్యాపకులు బోధించే విషయాలను విని విశ్లేషించుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువుతోపాటు సంస్కారాన్ని నేర్పించాలని కోరారు. 34ఏళ్లుగా అల్ఫోర్స్ విద్యాసంస్థ పిల్లల ఎదుగుదలకు ఎనలేని కృషి చేస్తోందని సంస్థ చైర్మన్ నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇతరభాషల కంటే ముందు పిల్లలకు మాతృభాష తెలుగు నేర్పాల్సిన అవసరం ఉందని తెలిపారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆపరేషన్ థియేటర్ నుంచి పరీక్షా కేంద్రానికి..

- ఇంటర్ పరీక్ష రాసిన ఇద్దరు విద్యార్థులు


పరీక్ష సెంటర్‌లోకి వీల్‌చైర్‌లో వస్తున్న సల్మాన్

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర గ్రామానికి చెందిన సల్మాన్, మహేశ్ ఇంటర్ విద్యార్థులు. ఈనెల 4న ఇంటి నుంచి ఇతర పనుల నిమిత్తం బైక్‌పై మండల కేంద్రానికి వెళ్లారు. మొహళ గ్రామ సమీపంలో బైక్ అదుపు తప్పగా ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు లోకేశ్వరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స పొందారు. రాత్రి మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో నిర్మల్ ఆస్పత్రికి తరలించారు. వెంటనే అక్కడి ఎముకల వైద్య నిపుణుడు ప్రమోద్‌చంద్ర ఇద్దరు విద్యార్థులకు విరిగిన ఎముకలకు మంగళవారం తెల్లవారుజాము వరకు ఆపరేషన్ నిర్వహించారు. దీంతో బుధవారం ఇంటర్‌మొదటి సంవత్సరం గణిత పరీక్షను అంబులెన్స్‌లో వచ్చి రాశారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో బుధవారం ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. హ్యాండ్‌బాల్ జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి వంద మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఉత్తమ ప్రతిభ చూపిన 16 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. సంజయ్, శ్రావణ్, అనిశ్వర్, సంతోష్, అనిల్‌కుమార్, ప్రదీప్, కార్తీక్, అశ్విన్, కార్తీక్, శ్రీధర్, నవీన్, సాయివర్ధన్, రిషికేష్, మన్విత్ ఎంపికయ్యారు. ఈ నెల 8 నుంచి 10 వరకు వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణారావు, కోచ్‌లు అరవింద్, రాకేశ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'ఎంపీ టికెట్ తిరుపతికే ఇవ్వాలి'

ఉట్నూర్‌రూరల్: కాంగ్రెస్ పార్టీ నుంచి ఆదిలాబాద్ ఎంపీ టికెట్ పార్టీ సీనియర్ నాయకులు కోట్నాక్ తిరుపతికే ఇవ్వాలని ఆపార్టీ సీనియర్ నాయకుడు సోయం భీంరావు అన్నారు. బుధవారం ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నోఏళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్నారని, టికెట్ ఇస్తే ఆయన గెలుపుకోసం కృషి చేస్తామన్నారు. సమావేశంలో ఎం.శంకర్, పి.మాణిక్ రావు, ఆత్రం రాజ్‌కుమార్, ఆత్రం సురేశ్, టేకం గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ


బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ ఫణిధర్

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిధర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సర్కిల్ పరిధిలోని ఆదిలాబాద్ రూరల్ ఎస్సైతో పాటు తాంసి, తలమడుగు ఎస్సైలు, సీఐ కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు

పుస్తకపఠనంతోనే భాషాభివృద్ధి

జైనథ్: విద్యార్థుల్లో భాషాభివృద్ధిని పెంపొందించేందుకు పుస్తక పఠనం దోహదం చేస్తుందని నయీ తాలీం సంస్థ దక్షిణ భారత కోఆరినేటర్ సీఏ ప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని లక్ష్మీపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థుల చేత కథలు చెప్పించి గేయాలు, పాటలు పాడించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పోరెడ్డి అశోక్, ఉపాధ్యాయులు ఎ

'తల్లిదండ్రులే కలియుగ దేవుళ్లు'

ఇచ్చోడ: తల్లిదండ్రులే కనిపించే కలియుగ దేవుళ్లని వైష్ణవ సదన్ పీఠాధిపతి నారాయణ మహారాజ్ అన్నారు. ముఖరా(బి)లో బుధవారం అఖండ హరినామ సప్తహ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహాత్ములు చెప్పిన వాటిని ఆచరించినప్పుడే సప్తాహ కార్యక్రమాలకు సార్థకత ఉంటుందన్నారు. మద్యం, మాంసాహారాలకు దూరంగా ఉన్న గ్రామాల్లో శాంతియుత వాతవరణం ఉంటుందన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

ముగ్గుల పోటీలు

జైనథ్: మండలంలోని కూర, జైనథ్ అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలోని విద్యార్థినులు, కిశోర బాలికలు పోటీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు స్వప్న, పొచ్చక్క, నర్సమ్మ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ హామీలు అమలు'

తలమడుగు: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను తూచ తప్పకుండా అమలు చేస్తుందని జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం సకినాపూర్‌లో గృహజ్యోతి లబ్ధిదారులకు జీరోబిల్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు చెప్పే మోసపూరిత మాటలు నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కళ్యాణ లక్ష్మి రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ బాబన్న, ఏఈ సతీష్, మాజీ సర్పంచ్ మారుతి, ఎంపీటీసీలు, రమేశ్‌రెడ్డి, వెంకన్న యాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన ఉండాలి

తలమడుగు: విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఏఎస్సై సురేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థి జీవితం చాలా ముఖ్యమైందని, క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుమలత, లలిత, వెంకటేశ్వర్, వినోద్‌రెడ్డి, మురళీధర్, రాకేష్, రాజేందర్, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల విజేత పొచ్చర

బోథ్: మండల కేంద్రంలోని లాల్‌పిచ్‌లో నిర్వహించిన క్రికెట్ పోటీలో పొచ్చర జట్టు విజయం సాధించింది. ఫైనల్ మ్యాచ్‌లో పొచ్చెర, బోథ్ ఎలెవన్ జట్లు తలపడగా పొచ్చెర జట్టు విజయం సాధించింది. ప్రథమ బహుమతి స్పాన్సర్ లింగారెడ్డి పొచ్చెర జట్టుకు, ద్వితీయ బహుమతి బోథ్ ఎలెవన్ జట్టుకు స్పాన్సర్ సురేందర్ అందజేశారు. గ్రామానికి చెందిన రాజు మ్యాన్ ఆఫ్ ది సిరీస్ మల్లెపూల మహేందర్‌కు అందజేశారు.

సేవా కేంద్రం ప్రారంభం

బోథ్: బోథ్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రజాపాలన సేవా కేంద్రం ప్రారంభించారు. ప్రజాపాలన దరఖాస్తుల సమయంలో తప్పులు దొర్లితే సేవా కేంద్రం ద్వారా సవరించుకునే అవకాశం ఉంది. 51 మంది దరఖాస్తుల తప్పులను సవరించుకున్నారు. ఎంపీడీవో రమేశ్ సేవా కేంద్రాన్ని పరిశీలించారు.

సకాలంలో అందని 'ఉపాధి' కూలి


ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

- ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కూలీలు
- ఫీల్డ్ అసిస్టెంట్లకు సైతం మూణ్నెళ్లుగా పెండింగ్‌లో వేతనాలు

ఆదిలాబాద్‌రూరల్: కొన్ని రోజులుగా ఎండలు దంచి కొడుతున్నాయి. వ్యవసాయ పొలాల్లో అంతగా పనులు లేకపోవడంతో కూలీలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లేందుకు మొగ్గు చూపుతున్నారు. అయితే కూలీల వేతనాలు రెండేళ్ల కిందట నుంచి కేంద్ర సర్వర్‌కు అనుసంధానం చేసిన విషయం తెలిసిందే. కొన్ని గ్రామ పంచాయతీలకు చెందిన కూలీలకు సంబంధించి ఫిబ్రవరి మాసం నుంచి వేతనాలు చెల్లించాల్సి ఉండగా మరికొన్ని గ్రామ పంచాయతీలకు చెందిన కూలీలకు మూడేసి నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని కూలీలు వాపోతున్నారు. కేంద్ర సర్వర్‌కు నివేదికలు ఎప్పటికప్పుడు పంపించినా నేటికీ కూలీల ఖాతాల్లో వేతనాలు జమ చేయని పరిస్థితి నెలకొంది.

అందని వేతనాలు

ఆదిలాబాద్ రూరల్ మండలంలో 15,400 జాబ్ కార్డులు ఉండగా 8,300 మంది కూలీలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు వెళ్తున్నారు. మావల మండలంలో 3,347 జాబ్ కార్డులు ఉండగా 4,949 మంది కూలీలు పనులకు వెళ్తున్నారు. వీరికి సకాలంలో వేతనాలు రాకపోవడంతో అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందని పలువురు కూలీలు వాపోతున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉపాధి హామీ కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించాలని కోరుతున్నారు.

పరేషాన్ అవుతోంది



ఉపాధి హామీ పనికి వెళ్తే ఎప్పటి పైసలు అప్పుడే ఇవ్వకుంట నెలల తరబడి పెండింగ్‌లో ఉంచుతుండడంతో పరేషాన్ అవుతోంది. మాకు వారం వారం కూలి పైసలు ఇస్తే బాగుంటుంది.

– సిడాం లచ్చుబాయి, కూలీ, ఉపాధి హామీ పథకం

ఇబ్బంది పడుతున్నాం



ఉపాధి కూలి పైసలు వారం వారం ఖాతాల్లో వేయకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. నాకు మూడు నెలల కూలి పైసలు రావాలి. పైసలు రాకపోవడంతో పనులకు వెళ్లాలంటే నిరాశ అనిపిస్తోంది. గత్యంతరం లేక వెళ్తున్నాం.

– మడావి రాము, కూలీ, ఉపాధి హామీ పథకం

ఖాతాల్లో జమ కావాల్సి ఉంది

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీల వేతనాలకు సంబంధించి నిధులు విడుదలయ్యాయి. త్వరలో వారి ఖాతాలలో జమ కానున్నాయి. ఉపాధి హామీ కూలీలు వేతనాల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– జాకీర్ హుస్సేన్, ఏపీవో, ఉపాధి హామీ పథకం

ఫీల్డ్ అసిస్టెంట్ల పరిస్థితీ అంతే..?

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఆదిలాబాద్ రూరల్, మావల మండలంలో కలిపి 21 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ పనులు పర్యవేక్షిస్తున్నారు. వీరికి చెల్లించే వేతనాలు సైతం మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్నట్లు ఎఫ్ఏలు పేర్కొంటున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి సకాలంలో వేతనాలు చెల్లించి ఆర్థికంగా అండగా నిలవాలని వారు కోరుతున్నారు.

'గోవర్ధన్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి'


మాట్లాడుతున్న మెట్టు ప్రహ్లాద్

ఆదిలాబాద్‌టౌన్: ఉన్నత స్థానంలో ఉండాలనే ఆలోచనతో కాంగ్రెస్ పార్టీ నాయకుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులపై నోటికి వచ్చినట్లు మాట్లాడటం సరికాదని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ జోగు రామన్న, మార్కెట్ మాజీ చైర్మన్ బావమరుదులు అంటూ మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండించారు. వెంటనే ఎస్సీ, ఎస్టీ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాకే జోగు రామన్న అధ్యక్షతన ఆదిలాబాద్ మార్కెట్ యార్డ్‌లో ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గ వ్యక్తులు మార్కెట్ చైర్మన్లుగా గుర్తింపు పొందారన్నారు. ఇది చూసి ఓర్వలేని గోవర్ధన్‌రెడ్డి డబ్బులు తీసుకొని పదవులు ఇచ్చాడని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. మరోసారి ఇలాంటి విష ప్రచారాలకు తెర లేపితే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో మార్కెట్ మాజీ చైర్మన్ కుమ్ర రాజు, మాజీ ఎంపీపీ సెవ్వ జగదీష్, విజ్జగిరి నారాయణ, రాజన్న, వేణు యాదవ్, డైరెక్టర్ పరమేశ్వర్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

'రైతునేస్తం' సద్వినియోగం చేసుకోవాలి


వీసీకి హాజరైన రైతులు, అధికారులు

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం రైతు వేదికలను అనుసంధానం చేస్తూ వినూత్నంగా చేపట్టిన రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి గణేశ్ అన్నారు. బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి తన నివాసం నుంచి ప్రారంభించిన రైతు నేస్తం కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులు, అధికారులు తిలకించారు. రైతులు తమ సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు తీసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, వైస్ ఎంపీపీ పడ్వాల్ గోపాల్‌సింగ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కుమ్ర కేశవ్‌రావ్, ఎంపీటీసీ గిత్తె ఆశాబాయి, ఏఎంసీ కార్యదర్శి రాజేశ్వర్, ఏఈవోలు నవతేజ్, వివేక్, కరుణ, తదితరులు పాల్గొన్నారు.

'ఎంపీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలి'

నేరడిగొండ: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ సీనియర్ నాయకుడు ఏలేటి అశ్విన్‌రెడ్డి అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి ఆయనను కలిసి రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా అనుసరించాల్సిన వ్యూహాల గురించి చర్చించారు. అనంతరం వారిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంట్ ఆశావహ అభ్యర్థి కోవ దౌలత్‌రావు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, బోథ్ మండల అధ్యక్షుడు కుర్మే మహేందర్, సిరికొండ మండల అధ్యక్షుడు షేక్ ఇమామ్, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం


గర్భిణులకు సీమంతం చేస్తున్న అధికారులు

నార్నూర్ : మహిళలు అన్నిరంగాల్లో రాణించినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ యశోద అన్నారు. బుధవారం గాదిగూడ మండల కేంద్రంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారత, బేటీ బచావో, బేటీ పడావో పథకాలు, మహిళల హక్కులు, చట్టాల గురించి ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ప్రదీపిక, లక్ష్మి, వందన, ఉమ, తదితరులు పాల్గొన్నారు.

ఎదులాపురం: ఆదివాసీ మహిళా సంఘం (తుడుం దెబ్బ) జిల్లా కమిటీ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జెడ్పీ కాన్ఫరెన్స్ హాల్లో ఈ నెల 8న అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక కోరారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ మహిళలు అనేక పోరాటాలు చేసి పురుషులతో సమానంగా హక్కులు సాధించుకున్నప్పటికీ ఇంకా అణచివేతకు గురవుతున్నారన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు ఉయిక ఇందిర, కార్యదర్శి సోయం లలిత, పుష్పరాణి పాల్గొన్నారు.

ప్రింట్ మీడియా అసోసియేషన్ సభ్యులకు సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: ప్రింట్ మీడియా ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇ.రవీందర్, అరుణ్‌రెడ్డిలను రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు బండారి కృష్ణ, ప్రధాన కార్యదర్శి అల్లాడి రఘురాం శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఐవో డాక్టర్ వైసీ శ్రీనివాస్, సంఘం ముఖ్య సలహాదారు బ్రహ్మానందరెడ్డి, రమణాచారి, ఎం.శ్రీకాంత్, రవీందర్ రాథోడ్, మహమ్మద్ అక్బర్, బి.ప్రమోద్‌కుమార్, నవీద్, మోసిన్, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

దంతాలను సంరక్షించుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు దంతాలను సంరక్షించుకోవాలని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ అధ్యక్షుడు సమీ ఉద్దీన్ అన్నారు. నేషనల్ డెంటిస్ట్ డేను పురస్కరించుకుని బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల గెజిటెడ్ నెం.1లో విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకోసారి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు అవగాహన లేకపోవడంతోనే సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రామకృష్ణారెడ్డి, ఆనంద్, సాయిరాం, రాహుల్, భార్గవ్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజలను మోసం చేస్తున్న బీజేపీ'

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ప్రజలను బీజేపీ మోసం చేస్తోందని ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వే లైన్ సాధన కమిటీ చైర్మన్ నారాయణ యాదవ్, ప్రధాన కార్యదర్శులు సిర్రా దేవేందర్, నిమ్మల నరేందర్ అన్నారు. రిలే దీక్షలు బుధవారంతో 51వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి ప్రధాన నరేంద్ర మోడీ వచ్చి ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. రైల్వే లైన్ గురించి ప్రశ్నిస్తే అరెస్టు చేయడం హేయమైన చర్య అన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఆదిలాబాద్ జిల్లా ప్రజలు ఓటు ద్వారా బీజేపీకి తగిన బుద్ధి చెబుతారన్నారు.

'ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి'

ఎదులాపురం: విధులకు డుమ్మా కొడుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయులపై తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసం సచిన్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి వేలాది రూపాయల వేతనాలు తీసుకుంటూ విధులకు సక్రమంగా హాజరు కాకుండా తమ సొంత వ్యాపారాలు, పనులకు ప్రాధాన్యత ఇస్తూ గిరిజన విద్యార్థుల చదువులకు అన్యాయం చేస్తున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలన్నారు. పర్యవేక్షణ చేయాల్సిన విద్యాశాఖ అధికారులు వారి నుంచి మామూళ్లు తీసుకుంటూ మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆరోపించారు. అలాంటి ఉపాధ్యాయులు, వారికి సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జ్యోతికి సన్మానం

బోథ్: సొనాల గ్రామానికి చెందిన బోయినపల్లి జ్యోతి ఏకంగా నాలుగు ఉద్యోగాలు సాధించింది. బుధవారం గ్రామస్తులు, 2003–4 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆమెను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గాజుల రమేశ్, నాగభూషణ్, రతన్ గౌడ్, రామగిరి శ్రీనివాస్, ముండె ఈశ్వర్, మునిగెల శ్రీధర్, అనిల్, రవికిరణ్, రాజేశ్, మృణాల్‌గౌడ్, బత్తుల రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సప్తాహ ముగింపు వేడుకలు


పల్లకి శోభాయాత్రలో భక్తులు

జైనథ్: మండలంలోని మాండగాడలో బాజీరావ్ బాబా సప్తాహ ముగింపు వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు, గీతాపారాయణం, హరిపాట్ గావించారు. అనంతరం బాబా చిత్రపటాన్ని బంతిపూలతో అలంకరించిన పల్లకిలో ప్రతిష్ఠించి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. దేవతావేశాధరణలో ఉన్న చిన్నారులను రథంపై కూర్చోబెట్టి పల్లకి వెంట నడిపించారు. మహిళలు మంగళ హారతులతో ముందుకుసాగగా, భక్తులు భజనలు, కీర్తనలు నిర్వహించారు. నృత్యాలు, కోలాటాలతో యువతీ, యువకులు శోభాయాత్రలో పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే పాయల్ శంకర్


సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

జైనథ్: పార్టీలకు అతీతంగా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. గత నాయకుల మాదిరి ఓటు వేయని గ్రామాలపై కక్షసాధింపు చర్యలకు దిగకుండా అభివృద్ధి చేస్తామన్నారు. బుధవారం ఆయన మండలంలోని పెండల్‌వాడలో ఉపాధి హామీ నిధులు రూ.25లక్షలతో నిర్మించిన సీసీరోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నేరుగా నిధులు కేటాయిస్తోందన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నానన్నారు. ఎలాంటి వివక్షకు తావివ్వకుండా అన్ని గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కట్కం రాందాస్, నాయకులు అశోక్‌రెడ్డి, నరేష్, అశోక్, ఉల్లాస్ రెడ్డి, పవన్, ప్రభాకర్, భూమన్న, ముకుంద్ రావ్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్


ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

నేరడిగొండ: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికత అలవర్చుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని మాట్‌లొద్దిలో నూతనంగా నిర్మించిన శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవచింతన మార్గంలో నడిచినప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కూడా సమయం కేటాయించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్, కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, నేరడిగొండ, ఇచ్చోడ ఎంపీపీలు రాథోడ్ సజన్, ప్రీతం రెడ్డి, బోథ్ ఏఎంసీ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్‌రావు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు సాబ్లే నానక్‌సింగ్, ప్రతాప్‌సింగ్, దేవేందర్ రెడ్డి, ప్రఫుల్‌చందర్ రెడ్డి, సద్దాం, సుజీల్, రాథోడ్ సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

పాలవాగులో పాఠశాల ప్రారంభం


పాఠశాలలో విద్యార్థులు, గ్రామస్తులతో సోయం కృష్ణవేణి

సాక్షి స్పందన

సిరికొండ: 'చదువుకు దూరంగా పల్లె' శీర్షికన శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. ఆదివాసీ ప్రజా సొసైటీ వ్యవస్థాపకురాలు సోయం కృష్ణవేణి బుధవారం గ్రామంలో పాఠశాలను ప్రారంభించారు. గ్రామంలో ఉంటున్న నిరుద్యోగ యువకుడికి గౌరవ వేతనం ఇచ్చి విద్యా వలంటీర్‌గా నియమించారు. విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు, పెన్నులు, పలకలు, బ్యాగులు అందించారు. దీంతో గ్రామస్తులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

మున్సిపల్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: మున్సిపల్ పారిశుధ్య, నీటి సరఫరా కార్మికులు, డ్రైవర్లకు పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.మల్లేశ్ బుధవారం ఆ సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ ఎండి. ఖమర్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనాలు రాక కార్మికులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తొమ్మిది నెలల పీఎఫ్, ఈఎస్ఐ పేరిట కట్ చేసిన రూ.1.36 కోట్ల నిధులను వెంటనే చెల్లించాలన్నారు. వారంతాపు సెలవులు ఇవ్వడంలేదని అనారోగ్యం కారణంతో విధులకు రాకుంటే వేతనంలో కట్ చేస్తున్నారన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, మున్సిపల్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు స్వామి, దర్శనాల నగేశ్, నాయకులు ఆత్మారాం, ఎం.జనార్దన్, వెంకటి, భరత్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

'ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేయాలి'


ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం నియోజకవర్గ కేంద్రంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అబద్ధాల హామీలకు కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. ఎల్ఆర్ఎస్ అంటే ప్రజల నుంచి డబ్బులు దోచుకోవడమే అన్న కాంగ్రెస్ నేతలు ఇప్పుడు డబ్బులు ఎందుకు వసూలు చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్, జెడ్పీటీసీ డా.సంధ్యారాణి, తాంసీ జెడ్పీటీసీ రాజు, నేరడిగొండ ఎంపీపీ సజన్, భీంపూర్ జెడ్పీటీసీ సుధాకర్, ఆయా మండలాల పార్టీ కన్వీనర్లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'మహిళా సాధికారతే బీజేపీ లక్ష్యం'



మాట్లాడుతున్న పతంగే బ్రహ్మానంద్

గుడిహత్నూర్: మహిళల సంక్షేమం, సాధికారతే బీజేపీ లక్ష్యమని పార్టీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శివ కల్యాణ మండపంలో నారీ శక్తి వందన్–అభినందన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళల రక్షణ మొదటి కర్తవ్యంగా భావిస్తూ అన్ని రంగాల్లో వారికి స్థానం కల్పించే దిశగా బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మోదీ లాంటి ప్రధానికి రాష్ట్ర మహిళలు అండగా నిలవాలని కోరారు. ప్రధాని మోదీ మహిళా స్వయం సహాయక సంఘాలు, ఎన్జీవో ప్రతినిధులతో వర్చువల్‌గా మాట్లాడిన ప్రత్యక్ష ప్రసారాన్ని ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేంద్రే లక్ష్మణ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు శివ, బీసీ మోర్చా మండల అధ్యక్షుడు భగవాన్, నాయకులు కుమార్, బోడ్కే జగన్, తదితరులు పాల్గొన్నారు.